జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

బుధవారం 16 సెప్టెంబర్ 2026 పేజీలు:19





కుటుంబ సమేతంగా గణపతి పూజలో పాల్గొన్న సింగల్ విండో చైర్మన్ గుడిపాటి

- ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష

2

# నల్లగొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## - మంత్రి కోమటిరెడ్డి



### - రూ.107 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**నల్లగొండ, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**

నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మండలం రాములబండ గ్రామ సమీపంలో రూ.107 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మిగతా 2 లో

# గిరిజనుల ఓట్లు కావాలి.. హామీల అమలు వద్దా..?



## - వెయ్యి రోజులు దాటినా 12 హామీలకు దిక్కేది..?

## - చేవెళ్ల ఎస్సీఎస్టీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని తుంగతుర్తి లో బీఆర్ఎస్ నిరసన

**తుంగతుర్తి, సెప్టెంబర్15,(ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ గిరిజన నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిగతా 2 లో

# నల్లగొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి





ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సుమారు రూ.850 కోట్లతో వివిధ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల్లో ఇప్పటికే 600 మీటర్ల పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. అవసరమైన అదనపు నిధులను సమకూర్చుకుని జూలై 2028 నాటికి సొరంగ మార్గం పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సొరంగ మార్గం పూర్తయితే నల్లగొండ రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజాసేవకు ప్రతిరూపం మాజీ మంత్రి ఆర్డీఆర్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

దివంగత నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ ఫ్లైఓవర్ వద్ద కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన ప్రజానాయకుడని కొనియాడారు.పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆర్డీఆర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.దామన్న జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయన చూపిన మానవతా మార్గాన్ని, ప్రజాసేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.



# గిరిజనుల ఓట్లు కావాలి.. హామీల అమలు వద్దా..?

మొదటిపేజీ తరువాయి



ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆధ్వర్యంలో గిరిజన నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలు ఇప్పటివరకు అమలు



చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటిన ఇప్పటివరకు ఒక్క హామీని అమలకు చేరుకోవడం దురదృష్టకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, రావులపల్లి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్,గిరిజన మాజీ సర్పంచ్ లు యాకు నాయక్,రాములు నాయక్, విరోజీ నాయక్, శంకర్ నాయక్,పూన్య నాయక్,నాయకులు దశరధానాయక్. పూర్ణ నాయక్. నాగునాయక్. వీరునాయక్. బూక్య ధర్మ,బూక్య రవి,పులాని, గోపాల్, బూక్య శ్రీను, మండల నాయకులు గుండగాని దుర్గయ్య మాల్యాల రాములు. గోపగాని రమేష్,గాజుల యాదగిరి,గోపగాని వెంకన్న, తడకమళ్ల రవి, మల్లిఖార్జున్,మధు,తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సమేతంగా గణపతి పూజలో పాల్గొన్న సింగల్ విండో చైర్మన్ గుడిపాటి

మొదటిపేజీ తరువాయి

వినాయక చవితి పండగను పురస్కరించుకుని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్ననాయకుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఉన్న అడ్డంకులు, విఘ్నాలు తొలగిపోయి ఆనందం, ఐశ్వర్యం, సకల విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లో తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన గణేశుడికి మంగళవారం కుటుంబ సమేతంగా గుడిపాటి సైదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరి జీవితాల్లో ఎదురయ్యే సకల ఆటంకాలు, విఘ్నాలు తొలగిపోయి, ప్రతి రంగంలోనూ అఖండ విజయాలు సాధించాలని ఆయన మనసారా ఆకాంక్షించారు.వాడవాడలా నిలిపిన మండపాల్లో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.



# బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

**కేతేపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**

నకిరేకల్ నియోజకవర్గం కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ వార్డు మెంబర్ వడ్డె ప్రభాకర్, విద్యా కమిటీ చైర్మన్ కందుకూరి నాగయ్య, వస్కుల వెంకన్న, వడ్డె ఎల్లేశ్, వడ్డె రాంబాబు, వడ్డె మాణిక్యం కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులై పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.



## పాతతరం జ్ఞాపకాలు.. ఎడ్లబండ్లపై వినాయకుడి ఊరేగింపు

**నూతనకల్.. సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోని శ్రీమాతా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఎడ్లబండ్లపై వినాయకుడి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎడ్లబండ్లపై గణనాథుడిని ఊరేగించే ఆనవాయితీ ఉండేదని, ప్రస్తుత తరానికి ఆ పాత జ్ఞాపకాలను గుర్తు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. అలంకరించిన ఎడ్లబండ్లపై వినాయకుడి విగ్రహాన్ని ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. యువత సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో సంప్రదాయాలు, పాతకాలపు ఆచారాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో, నాటి సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎడ్లబండ్లపై వినాయకుడి ఊరేగింపును నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. శ్రీమాతా ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు

**ఆలేరు సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా గణనాథుడిని ప్రార్థించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా సహజసిద్ధమైన పద్ధతిలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.







## బి ఎన్ తిమ్మాపురం గ్రామంలో ఘనంగా గణనాధుని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**భువనగిరి,రూరల్ సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

భువనగిరి మండలం బి ఎన్,తిమ్మాపురం గ్రామంలో,గ్రామ పంచాయతీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని,గణనాధుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాలను చిన్న పెద్ద అనే తేడా లేకుండా వీధి వీధిలో మండపాలు ఏర్పాటు చేసి గణనాధుని ఉత్సవాలను, భక్తిశ్రద్ధలతో శాంతి సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు ఆ గణనాధుని ఆశీర్వాదాలతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

## - ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది: ఎమ్మెల్యే వేముల వీరేశం

**కేతేపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**



అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే





వేముల వీరేశం అన్నారు. మంగళవారం కేతేపల్లి మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు, సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మంజుల మాధవరెడ్డి. చీకటిగూడెం సర్పంచ్ కోట విజయలక్ష్మి పూర్ణచంద్రరావు, మాజీ జెడ్పీటీసీ మల్లికార్జునరావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, కేతేపల్లి సర్పంచ్ బీరం జాన్ రెడ్డి, ఇనుపాముల సర్పంచ్ బజ్జ సుందర్, కాంగ్రెస్ నాయకులు విక్రమ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇంటి స్థలాల కోసం 18, 19న దీక్షలు

**నల్లగొండ, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి ప్రతినిధి ):**

నల్లగొండ నగర జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షలకు సంబంధించి యూనియన్ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి మొక్కల పంపిణీ 9వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 9వ వార్డులో వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మొక్కను పెంచే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని గుర్తు చేశారు. మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణ నని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సలీం, మున్సిపల్ సిబ్బంది మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఏడు రకాల సన్నధాన్యం వివరాలను డీలర్ షాపులలో ఆన్లైన్ చేసుకోవాలి

## - డిజిటల్ క్రాఫ్ట్ సర్వేర్లు పరిశీలిలన

## - జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల, మండల ఏవో శ్రీనివాస్

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**



ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల సన్నధాన్యం విత్తనాల వివరాలను రైతులు సెప్టెంబర్ 18 వ తేదీ లోపు డీలర్ షాపులలో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో సన్నధాన్యం డిజిటల్ క్రాఫ్ట్ సర్వేర్ లను పరిశీలించి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు సన్నపూరి రకాల ధాన్యానికి కొనుగోలు సమయంలో క్వింటాల్కు 500 రూపాయలు బోనస్ అందజేయనున్న నేపథ్యంలో సంబంధిత రైతులు తప్పనిసరిగా విత్తనాల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ 5204 , ఆర్ఎన్ఆర్ 15048 , హెచ్ఎంటి సోనా, వరంగల్ 44, కేఎన్ఎం 16 38, కేఎన్ఎం 77 15, జైశ్రీరామ్ సన్న వరి రకాల సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల వద్దకు పట్టాదారు పాసుబుక్కు మొబైల్ నెంబర్తో వెళ్లి వెంటనే ఆన్లైన్లో సన్న వడ్ల విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఒకవేళ డీలర్ వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధన స్థలల వద్ద విత్తనం కొనుగోలు చేసిన మరియు సొంత విత్తనం సాగు చేస్తున్న రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించి సన్నతనం సాగు చేసినట్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 18, 2006 తేదీ లోపు పూర్తి చేసుకోవాలని అదేవిధంగా మండలంలో ప్రైవేటు సర్వేయర్లు ద్వారా డిజిటల్ క్రాఫ్ట్ సర్వే నిర్వహించడం జరుగుతుంది కాబట్టి సర్వేను రైతులందరూ సద్వినియోగం చేసుకొని వారి యొక్క సర్వే నెంబర్లు ఏ పంటలు వేశారు నమోదు చేయవలసిందిగా సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజయ్య మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు గ్రామ సర్పంచ్ మొగులగానీ నరసయ్య

**ఆలేరు సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ మొగుల గాని నరసయ్య గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గణనాధుని నిర్వాహకులు ఏదు కృష్ణ, వట్టపు రాకేష్, వెంకటేష్, జాంగిర్, మధు, ఉపేందర్, ఉదయ్ మహిళలు యువకులు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



# ఏ.ఐ.కె.ఎం.ఎస్. జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## ఆలేరులో బైక్ ర్యాలీ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**





రైతాంగాన్ని సమీకరించి, రైతుల సమస్యలపై దేశవ్యాప్త పోరాటాలను మరింత ఉధృతం చేయడానికి జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏ.ఐ.కె.ఎం.ఎస్. జిల్లా అధ్యక్ష కారుదర్శులు కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్ లు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో మహాసభల జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఆలేరులో ఏ.ఐ.కె.ఎం.ఎస్. ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్ మాట్లాడుతూ.. దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో రైతుల హక్కుల కోసం జరిగే పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, అప్పుల భారం వంటి సమస్యలు రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయని అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దేశవ్యాప్తంగా రైతాంగాన్ని ఐక్యం చేసి పోరాటాలను నిర్మించడమే లక్ష్యంగా ఏ.ఐ.కె.ఎం.ఎస్. పనిచేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జరగనున్న జాతీయ మహాసభలు భవిష్యత్ రైతాంగ పోరాటాలకు దిశానిర్దేశం చేసే కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు. జాతీయ మహాసభల పిలుపును గ్రామగ్రామానికి తీసుకెళ్లేందుకు ఆలేరు ప్రాంతంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. బైక్ ర్యాలీ ద్వారా ప్రజలకు మహాసభల సందేశాన్ని చేరవేయడంతో పాటు, పోస్టర్లను ఆవిష్కరించి మహాసభల ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, యువత, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో జాతీయ మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్. జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, ఇక్కిరి సహదేవ్, సహాయ కార్యదర్శి మామిడాల బాలమల్లేష్, తమ్మడి అంజయ్య, పాకాల సరిత, రాఘవ రెడ్డి, గోపాల్ రెడ్డి, మేకల వెంకటేష్, మార్కొండయ్య , పాకాల నరేష్, బాల్ రెడ్డి,ఇక్కిరి శ్రీనివాస్, గడ్డం మంకన్న, మురళి, కుమార్, అంజిరెడ్డి, భూష శ్రీశైలం, బాలయ్య, రామ చంద్రయ్య, మశయ్య, ఆర్.ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

---

## బోనస్ కోసం రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- ఏవో ఋష్యేంద్రమణి**

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 15, (ప్రజాజ్యోతి):**

వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ప్రభుత్వం అందించే బోనస్ పొందాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. ఋష్యేం ద్రమణి కోరారు. మంగళవారం స్థానికంగా మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 లు బోనస్ అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందనితెలిపారు. ఈ పథకానికి అర్హత కలిగిన పెండింగ్‌లో ఉన్న రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓల ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే సొంత విత్తనాలు, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే ) ద్వారా లేదా ఇతర మార్గాల్లో విత్తనాలు పొందిన రైతులు కూడా ఈ బోనస్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.రైతులు ఎటువంటి ఆలస్యం చేయకుండా సెప్టెంబర్ 30 లోపు తమ వివరాలను నమోదు చేసుకుని ఈ ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.ఈ కార్యక్రమం లో ఏఈఓ పార్వతి, రైతులు శ్రీనివాస్ చారి, సూరోజు పోతునూరి చారి, చిమట రామరాజు తదితరులు పాల్గొన్నారు.



---

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించే మతోన్మాదులకు బుద్ధి చెప్పండి

**- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం**

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం కుల, మతాలకు అతీతంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందని కానీ కొంత మంది మతోన్మాదులు చరిత్రను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం విమర్శించారు.తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా గుండ్ల గూడెం, పటేల్ గూడెం, శ్రీనివాస పురం గ్రామంలో నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లో పాల్గొన్న ఎసి రెడ్డి నరసింహ రెడ్డి, బొమ్మ కంటి లక్ష్మి నర్సయ్య, గ్యార బాలయ్య, ఏంటిక రాములు , గ్యార సిద్దయ్య తదితరుల స్థూ పాలకు. పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడమైనది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గానీ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో గానీ పాల్గొనని వారు నేడు దేశభక్తి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బ్రిటిష్ పాలకులకు లొంగిపోయి వారి అనుకూలంగా వ్యవహరించిన శక్తులు నేడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూముస్లిం పోరాటంగా వక్రీకరించడం ద్వారా ప్రజల మధ్య మత విభజనలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. నిజాం ముస్లిం పాలకుడైనప్పటికీ తెలంగాణలోని అనేక మంది భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్లు హిందువులే ఉన్నారని, దోపిడీకి మతం లేదని అన్నారు. పేద రైతులు, కూలీలు, మహిళలు, అణగారిన వర్గాలు కుల,



మత భేదాలను అధిగమించి సాగించిన ఈ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను ఓట్ల కోసం వక్రీకరించడం, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ వారి ఆశయాల సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని మల్లేశం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు.ఎం ఏ ఇక్బాల్, మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సూదగాని సత్య రాజయ్య, జూకంటి పౌల్, మిట్ట శంకరయ్య, నల్ల మాస తుల శయ్య, పిక్క గణేష్ మోరీ గాడి రమేశ్, సంగీ రాజు, బొమ్మకంటి లక్ష్మి నారాయణ,గణ గాని మల్లేష్, చౌడ బోయిన యాదగిరి, వడ్డే మాను బాలరాజు, పారుపల్లి సత్తయ్య, గ్యార భాస్కర్ మడిపల్లి ఆంజనేయులు, చెక్కిళ్ళ ఉపేంద్ర, మిట్ట పార్వతమ్మ, దూసరి మల్లమ్మ, ఈదు నూరి కిష్టయ్య, సోమక్క, గ్యార అండాలు ,మిట్ట బిక్షపతి, చెక్కిళ్ళ గౌరమ్మ, ఎల్లమ్మ, అంజమ్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగం మరువలేనిది

## - సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**తుంగతుర్తి, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**




తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలు మరువలేనివని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం తుంగతుర్తి మండలం వెంపటి, అన్నారం గ్రామాల్లో సాయుధ పోరాట యోధులు దాయం రాజిరెడ్డి, దొగ్గరి ముత్తిలింగం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి, పేదల హక్కుల కోసం నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటంలో దాయం రాజిరెడ్డి, దొగ్గరి ముత్తిలింగం పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించి, ఆనాటి పోరాట యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాయం రాజిరెడ్డి మనవరాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి, ఎల్గెల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, నందూరి కర్ణకుమారి, రాజారాం, వెంపటి సర్పంచ్ తప్పెట్ల ఎల్లయ్య, ఎనగందుల విష్ణుమూర్తి, గుండ గాని నరసయ్య, కొండగడుపుల ముత్తయ్య, ఎడవల్లి శ్రీకాంత్, పాల్వాయి పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా వినయ్

**అనంతగిరి మండలం గొండ్రియాల**

**(ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 15 2026**



తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా అనంతగిరి మండల పరిధిలోని గొండ్రియాల గ్రామానికి చెందిన నెల్లూరి వినయ్ కుమార్ మంగళ వారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనకు ఎల్లప్పుడూ సహకరిస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య , అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి , తనపై నమ్మకం ఉంచిన టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ నవీన్ పెట్టం , టీపీసీసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతం కోసం మరింత కష్టపడి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# గ్రామీణ యువతకు ఉద్యోగ బాటలు

## - కోదాడలో సెప్టెంబర్ 19న మెగా జాబ్‌మేళా- 300 కంపెనీలకు ఆహ్వానం

## - 3,500 మందికి పైగా ఉద్యోగావకాశాలు- ఎంపికైన వారికి అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు

## - ప్రతి అభ్యర్థికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూ అవకాశం- రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి








**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి):**

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ప్రముఖ పారిశ్రామిక సంస్థలతో ప్రత్యక్ష అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 19న కోదాడలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు 300 కంపెనీలను ఆహ్వానించామని,3,500 మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం జాబ్‌మేళా ఏర్పాట్లపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేదని,అయితే ప్రముఖ సంస్థలను సంప్రదించడం,ఉద్యోగ ఖాళీల సమాచారం తెలుసుకోవడం,ఇంటర్వ్యూల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు పదేపదే వెళ్లడం వారికి ఆర్థికంగా,సామాజికంగా భారంగా మారుతోందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలనే ఉద్దేశంతో కోదాడ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్,ఫార్మసీ,పాలిటెక్నిక్, ఐటీఐ,డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన యువతకు తమ అర్హతలు,నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థికి గరిష్ఠంగా ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూకు హాజరయ్యే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొన్నాయని,ఈసారి సుమారు 300 సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌తోపాటు వివిధ పారిశ్రామిక ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంస్థలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరిశ్రమలను కూడా మేళాలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతోపాటు సిమెంట్, తయారీ, సేవలు, ఐటీ, ఫార్మా, నిర్మాణ, వ్యాపార రంగాలకు చెందిన సంస్థలను సంప్రదిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పరిశ్రమలు కూడా మేళాలో పాల్గొనేలా పరిశ్రమల శాఖ అధికారులు ప్రత్యేకంగా సంప్రదించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం,పరిశ్రమల శాఖ,సింగరేణి సంస్థ సమన్వయంతో నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు

జాబ్‌మేళాలో ఇంటర్వ్యూల ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాపై ఇప్పటికే సుమారు లక్షన్నర మంది ఉద్యోగార్థులకు సందేశాలు పంపినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పత్రికలు, కరపత్రాలు,పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా గ్రామస్థాయి వరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ నమోదుతో అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవం వంటి వివరాలను ముందుగానే వర్గీకరించి, ఆయా కంపెనీల మానవ వనరుల అవసరాలకు అనుగుణంగా అభ్యర్థులను అనుసంధానం చేయవచ్చని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు,గ్రామ,మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

### ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, పార్కింగ్‌పై పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని మంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాన వేదికకు ఇరువైపులా సుమారు 200 మీటర్ల పరిధిలో వాహనాల రాకపోకలను నియంత్రించి, అభ్యర్థులు సులభంగా నడిచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక సదుపాయాలతోపాటు రవాణా, వసతి, భోజన ఏర్పాట్ల సమన్వయ బాధ్యతలను కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట ఆర్డీఓలకు అప్పగించినట్లు తెలిపారు. గ్రామీణ యువతకు అవకాశాల వేదికను నిర్మించి, ప్రముఖ కంపెనీలను వారి వద్దకు తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ మెగా జాబ్‌మేళా ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా గ్రామీణ ప్రతిభను విద్యాసంస్థలు, పారిశ్రామిక రంగంతో అనుసంధానించే శాశ్వత నమూనాగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహాతోపాటు వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిట్యాలలో సిమెంట్ బ్రిక్స్ కంపెనీ ప్రారంభం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**నల్లగొండ, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి ప్రతినిధి):**

చిట్యాల మున్సిపాలిటీ 9వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బ్రిక్స్ కంపెనీని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ ఏర్పుల పరమేశ్ ఏర్పాటు చేసిన ఈ కంపెనీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని, యజమాని ఏర్పుల పరమేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, మున్సిపల్ చైర్మన్ పందిరి గీతరమేష్, వైస్ చైర్మన్ గుండబోయిన లక్ష్మిసైదులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏద్దులపూరి కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..





# భక్తిశ్రద్ధలతో రెండవ రోజు వినాయక పూజలు - మండపాల వద్ద భక్తుల కోలాహలం

**తుంగతుర్తి, సెప్టెంబర్15,(ప్రజా జ్యోతి):**

వినాయక చవితి పండుగ సందర్భంగా రెండవ రోజు వినాయక మండపాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధివీధినా ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాలు భక్తులతో కళకళలాడు తున్నాయి. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు యువకులు, భక్తులు పాల్గొని స్వామి వారికి మొక్కలు చెల్లించుకున్నారు.



# తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కెసిఆర్ దే..!

## 17న,కొత్త ఎస్టీ జి.పి లలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

### - మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు ఆత్మగౌరవం, స్వయం పాలన కల్పించినందుకు కృతజ్ఞతగా ఈ నెల 17న,గ్రామ పంచాయతీలు మారిన తండాల్లో కెసిఆర్ చిత్రపటానికిపాలాభిషేకం నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు.మంగళవారం మిర్యాలగూడలోని బారాస పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల చిరకాల ఆకాంక్షను గుర్తించి తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతుంద న్నారు. మిర్యాలగూడ నియోజక వర్గంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం 58 నూతన గ్రామ పంచాయతీలు మంజూరు కాగా, అందులో 40 తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ భవనాలు, బిటి రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, గిరిజన గురుకుల పాఠశాలల భవనాలు, సంత్ సేవాలాల్ భవనం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేసినట్లు భాస్కర్ రావు తెలిపారు.తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు ఆత్మగౌరవాన్ని కల్పించిన కెసిఆర్ కి కృతజ్ఞతగా 17వ తేదీన ప్రతి తండా లో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తామని, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కెసిఆర్ చేసిన కృషిని ప్రజలకు వివరిస్తామన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తండా గ్రామ పంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు ,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొ నాలని ఆయన కోరారు . అనంతరం మిర్యాలగూడ నియోజకవర్గ గిరిజన నేతలతో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి,దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండి యూసుఫ్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఆంగోతు హాతిరామ్ నాయక్ , చౌగాని భిక్షం గౌడ్ , మట్టపల్లి సైదులు యాదవ్, కుందూరు వీరకోటిరెడ్డి, ధనావత్ బాలాజీ నాయక్ ,కుర్రా సేవియానాయక్ ,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ధనావత్ ప్రకాష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# కెసిఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణ యుగం

### - కాంగ్రెస్ వంచనను ఎండగడతాం

### - సెప్టెంబర్ 17 న తండాల్లో కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు

### - మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్





**హాలియా,సెప్టెంబర్15(ప్రజా జ్యోతి)**

కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనే గిరిజనులకు నిజమైన స్వర్ణయుగమని నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ స్పష్టం చేశారు. హాలియాలోని ఆయన నివాసంలో మంగళవారం ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్‌తో కలిసి నియోజకవర్గ గిరిజన ముఖ్య నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ 2022 సెప్టెంబర్ 17న కేసీఆర్ ప్రభుత్వం చారిత్రాత్మక జీవో జారీ చేసిందని గుర్తుచేశారు.ఈ నిర్ణయం జరిగి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా,నాగార్జునసాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గిరిజన తండాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు జరిగిన మేలును ప్రజలకు వివరిస్తూనే,ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలని సూచించారు.గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత,మైదాన ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. గిరిజన కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించి,హైదరాబాద్ హాలియా ప్రాంతాలలో గిరిజన భవనాలు నిర్మించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.ఎస్టీ డిక్లరేషన్‘ పేరుతో గిరిజన,ఎరుకల, ఆదివాసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ గిరిజనులను పూర్తిగా మోసగించిందని విమర్శించారు. అలాగే,తిరుమలగిరి సాగర్ మండల భూముల రీ-సర్వే అంశంపై అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలో 80 శాతానికి పైగా గిరిజనులే ఉన్నారని,ఎక్కడా దొరలు లేకపోయినా 4 వేల ఎకరాలు దొరల భూములని మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడిన మంత్రి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, బాబురావు నాయక్,రవి నాయక్,భిక్షా నాయక్,బొల్లం సైదులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం..

## – విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, అంకితభావం నేటి ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకం..

## – మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి







**నల్గొండ సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి):**

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంజనీర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు బీవీ రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్‌రావు, వనజతో పాటు పలువురు శాఖ ఇంజనీర్లు మంత్రిని కలిసి జాతీయ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ నిర్మాణం, అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి నేటి తరం ఇంజనీర్లకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో నాణ్యమైన మౌలిక వసతుల నిర్మాణానికి ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# ఈనెల 17న ప్రతి తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి: మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు







**దేవరకొండ, సెప్టెంబర్ 15, (ప్రజా జ్యోతి) :**

ఈనెల 17న ప్రతి తండాలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దే గిరిజన తండాలకు స్వపరిపాలన కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే కాంగ్రెస్ హామీలకే పరిమితం కాకుండా గిరిజనుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తెలంగాణలో గిరిజన తండాలను మరియు గూడెంలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా కల్పించి, గిరిజనులకు స్వపరిపాలనను అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దేనని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.మంగళవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ ఎస్టి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .....గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని ఆయన అన్నారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4,383 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా, సుమారు 3,146 తండాలు, గుడలను స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని తెలిపారు. 500కు పైగా జనాభా కలిగి, అప్పటికే ఉన్న గ్రామ పంచాయతీ కేంద్రానికి 1.5 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న తండాలు, గూడలు, ఆవాసాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.తండా గ్రామ పంచాయతీగా మారడంతో గిరిజనులకు సొంత సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యాలయం, నిధులు, స్థానిక అభివృద్ధిపై నిర్ణయాధికారం లభించిందన్నారు. 3,146 మంది సర్పంచులు, 24,682 మంది వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులుగా ఏర్పడి గ్రామస్థాయి పరిపాలనలో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించారని ఆయన తెలిపారు.ప్రత్యేక గ్రామ పంచాయతీల ద్వారా అంతర్గత రహదారులు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక వసతులపై స్థానికంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. తండాలు పెద్ద గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సమయంలో ఎదురైన పరిపాలనా నిర్లక్ష్యానికి ఇది శాశ్వత పరిష్కారం చూపిన సంస్కరణ అని రవీంద్ర కుమార్ అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎస్టి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కు చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. 202223లో రూ. 13,412.63 కోట్లు, 202324లో రూ. 15,232.62 కోట్లకు నిధులను పెంచినట్లు పేర్కొన్నారు.గిరిజన రైతులకు సాగుభూముల అభివృద్ధి కోసం గిరి వికాసం పథకం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కల్పించారని తెలిపారు.గిరిజన విద్యార్థుల కోసం నూతన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఐఐటీనీట్ కోచింగ్, స్టార్స్ వంటి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కోసం సీఎం ఎస్టీ ఎంట్రీప్రెన్యూర్ షిప్ & ఇన్నోవేషన్ స్కీం, డ్రైవర్ ఎంపవర్మెంట్ స్కీం వంటి కార్యక్రమాలను అమలు చేసినట్లు రవీంద్ర కుమార్ వివరించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనుల కోసం అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.ప్రతి గూడెం, తండా గ్రామ పంచాయతీకి ఏటా రూ.25 లక్షలు కేటాయిస్తామని, కొత్త గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని, కొత్త ఐటిడిఏ లు ఏర్పాటు చేస్తామని, గిరిజన విద్యార్థులకు విద్యా జ్యోతులు అందిస్తామని, ప్రతి మండలంలో ఎస్సీ/ ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందన్నారు.హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా గిరిజనులను మోసం చేయడం సరికాదని ఆయన అన్నారు.తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం కేవలం పరిపాలనా మార్పు కాదని, గిరిజనులకు ఆత్మగౌరవం, స్వపరిపాలన, అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించిన చారిత్రాత్మక నిర్ణయమని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామావత్ దాస్రూ నాయక్, టి వి ఎన్ రెడ్డి,వెల్లుగురి వల్లపు రెడ్డి, జార్పుల లోక్య నాయక్, కౌన్సిలర్ కేతవత్ రుప్లా నాయక్,రమావత్ రమేష్, రామావత్ మోహన్ కృష్ణ, ఇస్లావాత్ అభిషేక్, కేతవత్ శంకర్ నాయక్, కేతవత్ రవీందర్ తదితరులు ఉన్నారు.

# పేదోళ్ల ఆపదకు ఆసరా... సీఎం రిలీఫ్ ఫండ్

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

## 1.30 కోట్ల విలువైన చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి):**

ఆపద సమయంలో పేదవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 256 మంది లబ్ధిదారులకు 1.30 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం తమ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పేదల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలిచి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, తక్షణ సాయం అంది ఎలా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

## - అధికారిక వేడుకలపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి

## - ఇంటింటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలి

## - బీజేపీ నేత గంగిడి మనోహర్‌రెడ్డి




**చౌటుప్పల్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ విమోచన దినమైన సెప్టెంబర్ 17వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మవంశీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే.. నిజాం నిరంకుశ రజాకార్ల పాలన నుంచి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో తెలంగాణ ప్రాంతానికి 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛ లభించిందని గుర్తుచేశారు. ఈ చారిత్రక దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన మాటను తుంగలో తొక్కాయని విమర్శించారు. ఎందరో అమరవీరుల త్యాగాలతో సిద్ధించిన ఈ స్వాతంత్ర్యాన్ని స్మరిస్తూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలంతా తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, వీధుల్లో సగర్వంగా జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు కడారి ఐలయ్య యాదవ్, కైరంకొండ అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షంగౌడ్, ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీముత్తయ్య, సీనియర్ నాయకులు రమణగోని శంకర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం, నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, భవనం మధుసూదన్‌రెడ్డి, రెక్కల సుధాకర్‌రెడ్డి, కట్ట కృష్ణ, సర్పంచ్‌లు తంగళ్ల వెంకటేశం, నందగిరి వెంకటేశంగౌడ్, బత్తుల జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మంటపాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయండి

## - కమిషనర్ కు వినతి చేసిన బిజెపి నాయకులు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 15,( ప్రజాజ్యోతి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డులలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలంటూ మంగళవారం బిజెపి వన్ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు బంటు గిరి, మూల రాజిరెడ్డి, కొంగరి వెంకటరమణ ల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ మండపాల పరిసరాలలో ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుతూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. వీధిలైట్లు వెలిగేటట్లు ప్రతిరోజు పరిశీలన చేయాలన్నారు. ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా, దోమల నివారణ కోసం మందును పిచికారి చేయాలని కోరారు. ఖాళీ ప్రదేశాలలో పెరిగిన కంప చెట్లను పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేయాలని కోరారు. నీటి కొరత ఉన్నందున తాగునీటి సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల రమేష్, మోదుగుల అశోక్, బొడ్డు సోములు, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోనె కవిత, కోడి ప్రవీణ్, దైద సోములు, బంటు రవి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్గ అశోక్ అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల ఎమ్మార్వో కి మెమోరండం అందించి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చారిత్రక పోరాటాన్ని నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్రా రవీందర్, వార్డు సభ్యులు రేగు మల్లేష్, బల్దా నర్సింలు, శనిగరం ప్రదీప్ భూమండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



# సంప్రదాయ సాగుకు స్వస్తి.. శాస్త్రీయ వ్యవసాయంతో రైతులకు మహర్దశ.!

## - నానో సాంకేతికతో వ్యవసాయంలో విప్లవం - సేంద్రీయ ఎరువులకు పెరిగిన డిమాండ్

## - మండల వ్యవసాయ అధికారి వెంకన్న



**హాలియా,సెప్టెంబర్15(ప్రజా జ్యోతి)**



రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి,శాస్త్రీయ మెలకువలు పాటించడం ద్వారానే అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న పేర్కొన్నారు. యాచారం గ్రామంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ బుధవారం రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.సమగ్ర వ్యవసాయం,నానో ఎరువుల వినియోగం,పామాయిల్ సాగు యాజమాన్యం నేలల సంరక్షణ వంటి కీలక అంశాలపై నిపుణులు రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.సాధారణ యూరియా లభ్యత తక్కువగా ఉన్న సమయంలో నానో యూరియాను సరైన మోతాదులో పిచికారీ చేయడం వల్ల అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ వివరించారు. విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల సాగు ఖర్చులు పెరగడమే కాకుండా, నేల సారం తగ్గి పర్యావరణం దెబ్బతింటుందని హెచ్చరించారు.నానో ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. మార్కెట్లో సేంద్రీయ ఉత్పత్తులకు దేశీయంగా,విదేశాల్లో విశేష డిమాండ్ ఉందని,ఆ దిశగా అడుగులు వేసి అధిక లాభాలు పొందాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణలో భాగంగా పామాయిల్ సాగులో ఉత్తమ దిగుబడులు సాధించిన ప్రగతిశీల రైతు మక్కపాటి మనోహర్ రావు ఇతర రైతులకు అవసరమైన క్షేత్రస్థాయి యాజమాన్య పద్ధతులు,పోషకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కోరమండల్ కంపెనీ ప్రతినిధులు రాంప్రసాద్,పి. ప్రసాద్ లు నానో యూరియా, నానో డిఏపి వాడే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించగా, పతాంజలి సంస్థ ప్రతినిధి సుధాకర్ భవిష్యత్తులో రైతులకు లభించే మార్కెటింగ్ అవకాశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మహేష్, జితేందర్,కంపెనీల ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# ..నాడు కూలి.. నేడు డాక్టర్

## - పట్టుదలతో పీహెచ్‌డీ సాధించిన బొజ్జ ఆనంద్..

## - కష్టాలను అధిగమించి పీహెచ్‌డీ పట్టా సాధించిన నల్లగొండ బిడ్డ..

## - నిరుపేద వ్యవసాయ కుటుంబం నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు విజయ ప్రస్థానం..

## - 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న బొజ్జ ఆనంద్..

**నల్లగొండ సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి):**

పేదరికం చదువుకు అడ్డంకి కాదని నిరూపించారు నల్లగొండ పట్టణంలోని కేశరాజుపల్లికి చెందిన బొజ్జ ఆనంద్. వ్యవసాయ కుటుంబంలో జన్మించి, చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. బొజ్జ వెంకటయ్య, పుష్పమ్మ దంపతుల రెండో కుమారుడైన ఆనంద్ ప్రాథమిక విద్యను కేశరాజుపల్లి పాఠశాలలో, ఇంటర్మీడియట్‌ను నల్లగొండలో పూర్తి చేశారు. ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వెళ్లి అద్దె గదిలో ఉంటూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే చదువుపై దృష్టి సారించారు. లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో రేయింబవళ్లు శ్రమించి పీహెచ్‌డీని పూర్తి చేశారు.

### ఫ్లోరైడ్‌పై కీలక పరిశోధన..

ఉస్మానియా విశ్వవిద్యాలయం జియాలజీ ప్రొఫెసర్ గుండా ప్రభాకర్ పర్యవేక్షణలో కనగల్, గుర్రంపోడు మండలాల్లో హైడ్రోజియాలాజికల్, జియోకెమికల్ స్టడీస్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని నీటి వనరులపై పరిశోధన చేసి, ఫ్లోరైడ్, నైట్రేట్, సోడియం స్థాయిలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. వాటి నివారణకు తగిన సూచనలు చేస్తూ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి థీసిస్ సమర్పించారు.

### 85వ స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం..

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం, ముఖ్య అతిథి భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ ఎల్లా చేతుల మీదుగా బొజ్జ ఆనంద్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.ఈ సందర్భంగా ఆనంద్ తన విజయానికి సహకరించిన తల్లి దండ్రులు వెంకటయ్య, పుష్పమ్మతో పాటు అన్న అనిల్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన పరిశోధనకు మార్గదర్శకత్వం అందించిన ప్రొఫెసర్ గుండా ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఆనంద్ నల్లగొండ మైన్స్ జియాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.ఆనంద్ డాక్టరేట్ సాధించడంతో ఆయనకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.






# మట్టి విగ్రహాలే పరిరక్షణనికి రక్ష ఎస్సై కుమారస్వామి

**ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజిం చాలని ఎస్సై కుమారస్వామి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని నాంచారి పేట గ్రామంలో ఏర్పాటుచేసిన మట్టి గణేష్ మండపాన్ని వారు సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఓపి విగ్రహాలతో జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. గణేష్ ఉత్సవాలు నిమ జ్జనాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ రేణుక, పోలీస్ సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించు కోవాలి

- మిర్యాలగూడ డి.ఎస్.పి రవి

హాలియా,సెప్టెంబర్15(ప్రజా జ్యోతి)

గణేష్ ఉత్సవాలు,నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మిర్యాలగూడ డీఎస్పీ రవి పిలుపునిచ్చారు.హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సాయి ప్రతాప్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని మంగళవారం ఆయన దర్శించుకున్నారు.ఈ సందర్భంగా హాలియా సీఐ ఎస్. రాఘవరావు,ఎస్సై బండి సాయి ప్రశాంత్‌లతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ రవి మాట్లాడుతూ... శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. నిమజ్జన సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, పోలీసుల సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా ముగించాలని తెలిపారు.అనంతరం మండప నిర్వాహకులు పుచ్చకాయల రమణారెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ రవి,సీఐ రాఘవరావు,ఎస్ఐ సాయి ప్రశాంత్‌లను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు అంబటి మల్లికార్జున్‌రెడ్డి,జైపాల్ రెడ్డి, భక్తులు,ప్రజలు పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్ల సమ్మె కాలానికి విద్యుత్ చార్జీలు మినహాయించాలి

కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి):

సీఎంఆర్ సేకరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల యాజమాన్యాలు మిల్లులను బంద్ చేసి సమ్మె చేస్తున్న నేపథ్యంలో.. సమ్మె కాలానికి సంబంధించిన విద్యుత్ చార్జీలను పూర్తిగా మినహాయించాలని కోరుతూ దేవరకొండ, కొండమల్లేపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ డీఈ బాల్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సముద్రాల వెంకన్న మాట్లాడుతూ.. తప్పు చేయని మిల్లర్ల విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. నిబంధనల ప్రకారం మిల్లులను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై విజిలెన్స్, ఇతర అధికారుల వేధింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంఆర్ సేకరణలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి మిల్లర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.అలాగే మిల్లులు బంద్ చేసి సమ్మె చేస్తున్న కాలంలో విద్యుత్ వినియోగం లేకపోయినా స్థిర చార్జీల భారం పడుతున్నందున.. ఆ కాలానికి సంబంధించిన విద్యుత్ చార్జీలను పూర్తిగా మినహాయించాలని డీఈని కోరారు.వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం సభ్యులు కేసాని లింగారెడ్డి, శీల శ్రీనివాసులు, రాఘవేందర్, కుందె రామకృష్ణ, గోవింద్ జగతయ్య, శీల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బూరుగు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, కల్యాణ్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.



# దేశ అభ్యున్నతి కోసం మహిళలు తమ శక్తిని చాటారు

- అఖిల భారత మహిళా కాంగ్రెస్ 42వ వ్యవస్థాపక దినోత్సవ ఎర్రబెల్లి స్వర్ణ నీలం పద్మ

- మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి







ఆలేరు సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)

అఖిల భారత మహిళా కాంగ్రెస్ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన గాంధీభవన్లో అఖిల భారత మహిళా కాంగ్రెస్ 42వ వ్యవస్థాపక దినోత్సవ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విచ్చేసి కేక్ కట్ చేసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పదవి చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మహిళలు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బొట్టు పెట్టి మహిళలు అందరూ హారతులు ఇచ్చి సన్మానించడం జరిగింది. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ గతంలో మహిళల కోసం రజియా సుల్తానా రుద్రమదేవి సరోజిని నాయుడు ఇంద్ర గాంధీ ఎంతోమంది వీర మహిళలు మహిళల అభివృద్ధి కోసం పోరాడారని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసి మహిళా శక్తిని చాటారని అన్నారు నేటి మహిళలు నారి శక్తిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా శక్తి చాటాలని అన్నారు. మహిళలు శక్తివంతంగా పనిచేయాలని 1984 సెప్టెంబర్ 15 రోజున బెంగళూరులో జాతీయ మహాసభ జరిగింది .ఈ సభను స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గారు ప్రారంభించారు అప్పటినుండి సెప్టెంబర్ 15న మహిళా కాంగ్రెస్ ఒక ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశవ్యాప్తంగా రాష్ట్ర జిల్లా మండలాల పట్టణ స్థాయిలో విస్తరించిందన్నారు. మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడం ఎంతో గర్వకారణం అని అన్నారు. మహిళా సాధికారత రాష్ట్ర భవిష్యత్తుగా ప్రతి ఒక్క మహిళ జీవితాలలో వెలుగులో నింపుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలుగా వ్యాపారంలో రాణించి తమ ప్రతిభతో రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తులో భాగస్వాములు కావాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో మహిళా శక్తి పెట్రోల్ బంకులు ఆర్టీసీ డ్రైవర్లుగా ఓనర్లుగా మహిళా క్యాంటీన్లను మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. కాంగ్రెస్ రేవంతన్న ప్రభుత్వం రాబోయే ఏ ఎన్నికలు వచ్చినా అభ్యర్థులను గెలిపించే దిశగా మహిళా కాంగ్రెస్ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో . ఆర్ లక్ష్మి. కవిత. ఉష్రీ. మాధవి. శ్రీ జ్యోతి. అనురాధ. వైస్ ప్రెసిడెంట్స్. కృష్ణవేణి. బి రేఖ. శైలజ. లక్ష్మమ్మ. నిర్మల. రమాదేవి. డి నాగమణి. పావని. సాత్విక. బ్లాక్ ప్రెసిడెంట్స్. డివిజన్ ప్రెసిడెంట్స్. మండల ప్రెసిడెంట్స్. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేదలకు వేలాది ఎకరాలు పంచిన ఘనత కమ్యూనిస్టులదే..!

## తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

- సిపిఐ జిల్లా నాయకుడు బంటు వెంకటేశ్వర్లు





మిర్యాలగూడ, సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి):

తెలంగాణ సాయిధ పోరాటానికి వారసులు, పేదలకు వేలాది ఎకరాలు పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టుల దేనని సిపిఐ జిల్లా నాయకుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మిర్యాలగూడ మండలం యాదగిరి పల్లి గ్రామంలో సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా అమరవీరుల స్థూపం దగ్గర అమరు లకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగావెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతన్న సాయుధ పోరాటాలు కొనసాగినవని,ఆ పోరాటంలో వేలాది ఎకరాలను రైతులకు పంచిన ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. ఆనాడు నైజామును తరిమికొట్టిన ఘనమైన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని, తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తుందన్నారు. సాయుధ పోరాటం నడిచినప్పుడు బిజెపి పార్టీ నామకరణం కూడా జరగలేదని కేవలం వాళ్లు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని వాళ్లు ఇప్పటికైనా చరిత్రని చరిత్ర లెక్కనే ఉంచాలి తప్ప చరిత్రని వక్రీకరించొద్దని బిజెపి వారిని హెచ్చరించారు. సాయుధ పోరాటాల వారోత్సవాలను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 11న, గుండ్రంపల్లిలో మొదలై నల్లగొండ జిల్లాలో ఉన్నటువంటి అన్నినియోజకవర్గాలలో 17 తారీకు వరకు సాయుధ పోరాటాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సాయుధ పోరాట యోధులకు ఈ పోరాటంలో అమరులైన 4,500 మందిత్యాగాలు వృధా కాకుండా వారి అడుగుజాడల్లో కమ్యూనిస్టు పార్టీలు ప్రజా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, పోలేపల్లి ఉదయ్ కుమార్, బిల్లా కనకయ్య, డి లింగా నాయక్, గువ్వల మట్టయ్య, ఎస్కే షమీం, శ్రీనివాస్ రెడ్డి, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, మద్రి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాల కోసం జర్నలిస్టుల సమరభేరి..

## -18, 19 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు..

## - కలెక్టరేట్ ఎదుట దీక్షా స్థలాన్ని పరిశీలించిన.. టీయూడబ్ల్యూజేఐజేయూ

## - నల్గొండ నగర జర్నలిస్టులకు తక్షణమే స్థలాలు కేటాయించాలి...

## - టీయూడబ్ల్యూజే (ఐజేయూ),జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణ రెడ్డి.

**నల్గొండ సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి):**

నల్గొండ నగర జర్నలిస్టులకు తక్షణమే ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు. నల్గొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న దీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం యూనియన్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీక్షా స్థలాన్ని సందర్శించి అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు.జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ రిలే దీక్షలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులంతా ఐక్యంగా తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సమస్యకు ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు అబ్బోజు మదనాచారి తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు


- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణ.

-17న నల్గొండ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు..

- ఏర్పాట్లపై అధికారుల ప్రత్యేక దృష్టి..

- హాజరుకానున్న మేయర్,డిప్యూటీ మేయర్,మరియు కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు..

**నల్గొండ సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి):**



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న గురువారం ఉదయం 8.15 గంటలకు నల్గొండ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను చేపడుతున్నారు. ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్, గౌరవ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు ప్రజాపాలన దినోత్సవ ప్రాధాన్యతను వివరించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లుకార్యక్రమానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత



అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రజాపాలన దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణ కోరారు. కార్యక్రమానికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. 17న ఉదయం 8.15 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుండటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

# వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం పనుల గుర్తింపుపై గ్రామ సభ

## చందుపట్లలో వనరుల పటంతో పనుల గుర్తింపు

**నకిరేకల్, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**

నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామపంచాయతీలో వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం అమలులో భాగంగా పనుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని వనరుల పటాన్ని రూపొందించి గ్రామసభ ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాల్సిన పనులను గుర్తించారు.ఈ సందర్భంగా పథకం కింద చేపట్టే పనులను నాలుగు కేటగిరీలుగా వివరించారు. ముందుగా జల సంరక్షణకు సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. గ్రామంలోని మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఈసీ, మండల టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఉప్పు శ్రీనివాస్‌ను పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట రూరల్ మండలం రామారం గ్రామంలో ని ఉప్పు శ్రీనివాస్ ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నీ బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి పరామర్శిం చారు.మంగళవారం శ్రీనివాస్ రామారావు గ్రామంలోని స్వగృహానికి వెళ్లిన ఆమె,ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. శ్రీనివాస్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు,జిల్లా పదాధికారులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నేమాల శ్రీనివాస్ పార్థివదేహానికి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

**త్రిపురారం సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)**

మండల కేంద్రంలో నీలయిగూడెం గ్రామానికి చెందిన నెమాల శ్రీనివాస్ గారు గుండెపోటుతో మరణించడంతో వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆలంపల్లి జానయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి పిఏ సీ స్ మాజీ చైర్మన్ అనుముల అనంత్ రెడ్డి, మాజీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు గగ్గినపల్లి చంద్రారెడ్డి , నీలాయిగూడం సర్పంచ్ ఒట్టికోటి మధు, సత్యనారాయణ పురం సర్పంచ్ వేగుల్లా శ్రీలత శ్రీనివాస్, తాతారావు,గారు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# ఇంజినీర్లే దేశ భవిష్యత్తుకు రూపశిల్పులు - డాక్టర్ పావులూరి సుబ్బారావు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**

దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఇంజినీర్స్ డే2026 వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మార్కులకే





పరిమితం కాకుండా సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని వినూత్న ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఏజెంట్‌ఎక్స్, కోడింగ్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ డిజైన్ తదితర పోటీలు నిర్వహించారు. స్మైల్‌గార్డ్ సౌజన్యంతో విద్యార్థులు, సిబ్బందికి ఉచిత దంత, నేత్ర, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## ఎంఆర్‌ఓకు బీజేపీ నాయకుల వినతిపత్రం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**




తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సూర్యాపేట మండల నాయకులు మంగళవారం అసిస్టెంట్ తహశీల్దార్ లచ్చు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు,మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు అలుగుబెల్లి సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించినప్పటికీ, తెలంగాణ ప్రాంతం నిజాం,రజాకార్ల నిరంకుశ పాలన నుంచి 1948 సెప్టెంబర్ 17న విముక్తి పొందిందన్నారు.ఈ చారిత్రక రోజును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం గా నిర్వహించి చరిత్రను గౌరవించాలని కోరారు.సెప్టెంబర్ 17న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు,ప్రభుత్వ కార్యాలయాల్లో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తూ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు వెనుకాడుతోందని విమర్శించారు.రాజకీయాలకు అతీతంగా అమరవీరుల త్యాగాలను గౌరవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తండ అంజయ్య గౌడ్,గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, మండల నాయకులు రాచకొండ వాసు, ఎల్గూరి మహేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యకు ఘన స్వాగతం.. కొలువుదీరిన గణనాథులు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):**





వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భూదాన్ పోచంపల్లి పట్టణ, మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ కాలనీలు, ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గణనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వినాయక విగ్రహాలను మండపాలకు తీసుకొచ్చే సందర్భంగా భక్తులు, యువత డప్పు చప్పుళ్లు, భక్తిగీతాల మధ్య ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.పలు వినాయక మండపాలను విద్యుత్ దీపాలు, పుష్పాలు, రంగురంగుల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో పట్టణం, గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. రానున్న రోజుల్లో మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీలు, భక్తులు, యువకులు పోలీసుల సూచనలు పాటించాలని మేధావులు కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

## - ఎంఎం ఫౌండేషన్ సహకారంతో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ , శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ముప్పారపు మురళీ ఫౌండేషన్ నిర్వాహకులు ముప్పారపు నాగేశ్వరరావు, గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సూర్యాపేట అధ్యక్షులు ముప్పారపు నరేందర్, శ్రీవాసవి సేవా సమితి అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం అన్నారు.వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అలంకార్ థియేటర్ వద్ద గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సూర్యాపేట,శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ముప్పారపు మురళీ ఫౌండేషన్ సహకారంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుండి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని కోరారు.రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతులకు బదులుగా మట్టి విగ్రహాలను పూజించడం వల్ల నీటి కాలుష్యం జరగకుండా, జలచరాలకు హాని కలగకుండా పర్యావరణాన్ని కాపాడవచ్చని అన్నారు.ఇంట్లో పూజించే వందలాది



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు,గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, తోట శ్యామ్ ప్రసాద్,యాద కిరణ్, మొరిశెట్టి యోగి, దేవరశెట్టి నాగరాజు,గోపారపు రాజు,గెల్లి అంజన్ ప్రసాద్,సోమా ప్రవీణ్, చల్లా సత్యనారాయణ, ఉప్పల శ్రవణ్ కుమార్, పిట్టల వర్మ, వీరవెల్లి ఉమా తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భాధ్యతగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

## - జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

గత పది సంవత్సరాల నుండి సూర్యాపేట పట్టణంలో చల్లా బ్రదర్స్ చల్లా లక్ష్మీకాంత్ ,చల్లా లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్నామని జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ అన్నారు.వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వీటి రోడ్ లోని వారి నివాసం వద్ద 600 బంక మట్టి గణేష్ విగ్రహాలను, చేతి సంచులను, వినాయక వ్రతకల్పం పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ చల్లా లక్ష్మి ప్రసాద్, శ్రీవెంకటలక్ష్మి హీరో షోరూం ఎండీ రాచర్ల కమలాకర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, పొలిటికల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, పోతుగంటి వెంకటేశ్వర్లు, గోపారపు రాజు, సోమ వెంకటేశ్వర్లు, సోమ ప్రవీణ్, యామా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారే

## - మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి

## - ఘనంగా జరిగిన దేవరకొండ నియోజకవర్గ గిరిజన ముఖ్య కార్యకర్తల సమావేశం.







**దేవరకొండ, సెప్టెంబర్ 15, (ప్రజా జ్యోతి) :**

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు పెద్దపీట వేసి, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) కే దక్కుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.నేడు దేవరకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారి అధ్యక్షతన, వారి నివాసంలో గిరిజన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో గిరిజన సంక్షేమానికి జరిగిన అద్భుతమైన కృషిని కొనియాడారు.

### ప్రకటనలోని ముఖ్య అంశాలు

10 శాతానికి రిజర్వేషన్ల పెంపు: గిరిజనుల దశాబ్దాల నాటి డిమాండ్‌ను నెరవేరుస్తూ, వారి రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తండాలకు గ్రామపంచాయతీ హోదా: 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చడం ద్వారా "మా తండాలో మా రాజ్యం" అనే నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారన్నారు.

దీనివల్ల వేలాది మంది గిరిజనులకు రాజకీయాల్లో గుర్తింపు, నాయకత్వ బాధ్యతలు లభించాయని గుర్తుచేశారు.కేసీఆర్ కి పాలాభిషేకం గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి కృతజ్ఞతగా.. ఈ నెల 17వ తేదీన రాష్ట్రంలోని అన్ని తండాలలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజన సమాజం అంతా బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్, కేతావత్ భీల్యా నాయక్ , దేవరకొండ నియోజకవర్గ బిఆర్ఎస్ యువ నాయకులు ఇస్లావత్ అభిషేక్ నాయక్ మరియు పెద్ద సంఖ్యలో గిరిజన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే ప్రతి ఒక్కరు పూజించాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాసులు అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వినాయక చవితిని పురస్కరించుకొని ఆర్యవైశ్య పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి రమేష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా 200 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి హాని జరిగి నీటి కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు.పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా మట్టి గణపతి విగ్రహాలను పూజిస్తే భవిష్యత్ తరాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సోమ వెంకన్న, రాచకొండ శ్రీనివాస్, కందిబండ ఉమామహేశ్వరావు, కక్కిరేణి ప్రసాద్, తల్లాడ ప్రవీణ్, అడ్డగూడూరు శ్రీనివాస్, కలకోట లక్ష్మయ్య, అనిత, నరేంద్రుని శ్రీధర్, సెక్రటరీ లకుమారపు పద్మజ, బెలిదే లక్ష్మి, చల్లా హేమలత, ఓరుగంటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులుగా లక్ష్మణ్

ఆలేరు సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని ఆరో వార్డు బహుదూర్ పేట గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులుగా వట్టిపల్లి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సాగర్ రెడ్డి ,అశోక్, మాజీ అధ్యక్షుడు ఎజాస్, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, పిక్క శ్రీనివాస్,మాజీ సర్పంచ్ నర్సింలు, పిఎసిఎస్ డైరెక్టర్ వట్టిపల్లి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు వల్లపు ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు: ఇంజనీర్లందరికీ 'ఇంజనీర్స్ డే' శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ, సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి) :

భారతదేశ ఆధునిక నిర్మాణ శిల్పి, గొప్ప రాజనీతిజ్ఞుడు, భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి జయంతి సెప్టెంబర్ 15 సందర్భంగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆ మహనీయునికి శతకోటి వందనాలు సమర్పించి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లం దరికీ ఆయన జాతీయ ఇంజనీర్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ... దేశంలో ఎన్నో అద్భుతమైన సాగునీటి, పారిశ్రామిక ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, భారతదేశ సాంకేతిక రంగానికి విశ్వేశ్వరయ్య బలమైన పునాది వేశారు. ఆయన క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయం అని కొనియాడారు.తమ అద్భుత మేధస్సు, సృజనాత్మకతతో సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ఇంజనీర్ల సేవలు వెలకట్టలేనివని ఆయన పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య గారి స్ఫూర్తితో ఇంజనీర్లందరూ దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని, దేవరకొండ నియోజకవర్గంతో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తమ వంతు కృషిని కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.




# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్

- ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలిపర్యావరణహిత మట్టి వినాయకులను పూజించాలన్న ఎమ్మెల్యేపండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపు

దేవరకొండ, సెప్టెంబర్ 15, (ప్రజా జ్యోతి) :

విఘ్నాలను తొలగించి, సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో వినాయకచవితికి అత్యంత విశిష్టమైన స్థానం ఉందని, వినాయకుడు జ్ఞానం, విజ్ఞానం, విజయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. వినాయకచవితి ఉత్సవాలు సామాజిక ఐక్యతను, సోదరభావాని, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు.ముఖ్యంగా, విఘ్నేశ్వరుడి కృపతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఆనందం, ఆర్థిక అభివృద్ధి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. రైతులకు పంటల సమృద్ధి, యువతకు ఉజ్వల భవిష్యత్తు, విద్యార్థులకు ఉత్తమ జ్ఞానం కలగాలని ఆ గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ, రసాయన విగ్రహాలకు దూరంగా ఉంటూ పర్యావరణహిత (మట్టి) వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన మరియు నిమజ్జనం కార్యక్రమాలను



భక్తిశ్రద్ధలతో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు.వినాయకుని ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు.

# ఎన్నికల ముందు తాయిలాలు కాదు.. ఇచ్చిన హామీల అమలే కావాలి: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్

దేవరకొండ, సెప్టెంబర్ 15, (ప్రజా జ్యోతి) :

ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేలా కొత్త తాయిలాలు ప్రకటించడం కాకుండా, గతంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలను గుర్తుంచుకునే రాజకీయ పంథాను మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయాలనే ఆలోచనను కాంగ్రెస్ మానుకోవాలని హెచ్చరించారు. రమావత్ రవీంద్ర కుమార్ ప్రధాన డిమాండ్లు మరియు వ్యాఖ్యలు

ఐదేళ్లూ ప్రజా సంక్షేమమే లక్ష్యం కావాలి: కేవలం ఎన్నికల ముందు మాత్రమే హడావుడి చేయడం కాదు, ఐదేళ్ల పదవీకాలంలో ప్రతి రోజూ ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేయాలి. ప్రజలు అమాయకులు కారు: ఎన్నికల వేళ ఇచ్చే వరాలతో ఓటర్లను మభ్యపెట్టలేరు.ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ స్పష్టంగా గుర్తుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ప్రజల విశ్వాసం గెలుచుకోవాలి. కాలపరిమితి విధించాలి: ప్రజా హామీల అమలులో



జాప్యం ఎందుకు జరుగుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ప్రతి హామీకి ఒక నిర్దిష్ట కాలపరిమితిని ప్రకటించి, ఆ లోపు వాటిని అమలు చేయాలి.

### తిలోదకాలు ఇవ్వడం కాంగ్రెస్ అలవాటు:

ఎన్నికల ముందు పెద్దపెద్ద మాటలు చెప్పి, గెలిచిన తర్వాత హామీలను మరిచిపోవడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని, ప్రజల పాత బాకీలను తీర్చిన తర్వాతే కొత్త విషయాలు మాట్లాడాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై శ్వేతపత్రం విడుదల చేసి, వాటిని తక్షణమే అమలు చేయాలని రమావత్ రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు.

# గణేష్ వేడుకల్లో డిజే లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవు - డిఎస్పీ జి. రవి

**మిర్యాలగూడ సెప్టెంబర్ 15, (ప్రజాజ్యోతి):**

వినాయక చవితి వేడుకల్లో డీజే లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పీ జి.రవి హెచ్చరించారు. మంగళవారం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేలరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని పరిసర గ్రామాల్లో శాంతిభద్రత లకు, ప్రజల ప్రశాంత జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, నల్గొండ జిల్లా పోలీస్ యంత్రాంగం మిర్యాలగూడ సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టడంజరిగిందన్నారు.వినాయకమండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించినసమయాల్లో అనుమతించిన శబ్ద పరిమితుల్లో మాత్రమే స్పీకర్ బాక్సులు, బ్యాండ్ వంటి వాటిని వినియోగించాలన్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు, వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్న వారికి ఇబ్బంది కలిగించరాదన్నారు. వినాయక మండపాల వద్ద పోలీసుల నిరంతరం పర్యవేక్షణ చేపడుతూ,నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.




ఎలాంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలు, వినాయక ఉత్సవ నిర్వాహకులు పోలీసులకుసహకరించి, ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించాలని, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రజాశాంతికి భంగం వాటిల్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ లు ఎం.నాగభూషణరావు,జె. సోమ నరసయ్య తదితరులున్నారు.

# కొయ్యలగూడెంలో ముత్యాలమ్మ శోభాయాత్ర

## - కనులపండువగా వార్షిక ఉత్సవాలు

## - ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు.. డప్పు దరువులు

## - పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**చౌటుప్పల్, సెప్టెంబర్ (15 ప్రజా జ్యోతి)**

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పద్మశాలి కులబాంధవుల ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి ఊరేగింపును అత్యంత నేత్రపర్వంగా నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని పాలారం బండి వద్ద అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, యువకుల డప్పు దరువుల నడుమ సాగిన శోభాయాత్ర ఆద్యంతం భక్తిపారవశ్యంతో కొనసాగింది.ముఖ్యంగా ఊరేగింపులో పోతరాజుల నృత్య విన్యాసాలు గ్రామస్థులను, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ వీధుల్లో మహిళలు ఇళ్ల ఎదుట నీళ్లు చల్లి, ముగ్గులు వేసి అమ్మవారికి మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో స్థానిక కులపెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్లు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నార్కట్ పల్లి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## - వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపు

**నార్కట్ పల్లి, 15 (ప్రజా జ్యోతి):**

విఘ్నాలను తొలగించి, సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడికి ఆశీస్సులు నార్కట్ పల్లి ప్రజలందరికీ ఎల్లప్పుడు అండగా ఉండాలని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన పురస్కరించుకొని నార్కట్ పల్లి మండల ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో వినాయక చవితికి అత్యంత విశిష్టమైన స్థానం ఉన్నదని, వినాయకుడు జ్ఞానం, విజ్ఞానం, విజయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.





# బాధితుని ఆర్థిక సహాయం..

**నూతనకల్.. సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడిలో గాయపడిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కొమ్ము రవిని మంగళవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం మాజీ పిఎసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.. హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయంగా 25 వేల రూపాయలను వారికి అందజేశారు.. రవి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను వెంకన్న తెలిపారు.. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి జక్కి పరమేష్, మన్యం రమేష్, మన్యం సైదులు, పెద్దింటి మధు, కాట్ల చిన్ని, ఏర్పుల కిరణ్, ఇరుగు మల్లయ్య, కొమ్ము మల్లేష్, ఇరువు వినయ్, లింగయ్య, నగేష్, సురేష్, ప్రవీణ్, లింగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు..



# మానవతా సేవే దామన్నకు నిజమైన నివాళి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు,వారి సహాయకులకు పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొద్దు సాయికృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్ హాజరై ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితమైన మాజీ మంత్రి దామోదర్ రెడ్డి సేవలు,సూర్యాపేట అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మాజీ మంత్రి ఆర్డీఆర్ జయంతిని పురస్కరించుకుని అల్పాహారం అందించడం ద్వారా మానవతా సేవే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



# రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం

- కృష్ణా,గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నా పంటలు ఎండబెడుతున్నారు
- మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో నీళ్లు, అభివృద్ధి కుంటుపడ్డాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు.రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.సాగర్ ఎడమ కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 7 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి అన్నారు. రైతులు పంటలు వేసుకోవాలా? వద్దా? అనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు.తెలంగాణకు రావాల్సిన నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాయాలన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇంతకంటే తక్కువ నీటి లభ్యత ఉన్న సమయంలోనూ తెలంగాణలో సమృద్ధిగా పంటలు పండించామని గుర్తుచేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేసి తెలంగాణను సస్యశ్యామలం చేశామని అన్నారు.కృష్ణా,గోదావరి నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతుల పంటలు ఎండిపోతున్నాయని జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కళ్ల ముందే ఇతర ప్రాంతాలకు నీరు తరలిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం




పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు పంటలు పండించకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పంటలు పండితే నీళ్లు, విద్యుత్, బోనస్ వంటి సౌకర్యాలు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు.రైతుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో పాదయాత్రలు చేసి పంటలను కాపాడారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల తరపున ఎలాంటి పోరాటానికైనా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూడాలని మిర్యాలగూడ రైతు ధర్నాలో కేటీఆర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. అవసరమైతే మరోసారి పాదయాత్రలు చేపట్టి రైతుల పంటలు ఎండిపోకుండా పోరాటం చేస్తామని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఈ నెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యం
- జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగ చేసుకోవాలి
- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**



నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో కోదాడ పట్టణంలో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ తదితర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభకు తగిన ఉద్యోగాలను పొందాలని కోరారు.జాబ్ మేళా వివరాలను కళాశాలల ద్వారా అందరికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# భక్తితో ఉత్సవం...భద్రతతో నిమజ్జనం..

- గణేష్ మండపాల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరి..
- చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి దారితీయొచ్చు..
- నిమజ్జనంలో అత్యుత్సాహం వద్దు.. నిబంధనలు పాటించాలి..
- 350 మంది గణేష్ మండపాల నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం..
- డీఎస్పీ శివరాం రెడ్డి





**నల్గొండ టౌన్ సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి):**

గణేష్ ఉత్సవాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు టూ టౌన్ ఎస్సై సైదాబాబు ఆధ్వర్యంలో బోయవాడ రత్న ఫంక్షన్ హాల్‌లో సుమారు 350 మంది గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండపాల వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు, లైటింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో ప్రజలు బయటకు వెళ్లేందుకు మార్గాలు స్పష్టంగా ఉండేలా చూడాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు."ఒక్క చిన్న జాగ్రత్త.. ఒక పెద్ద ప్రమాదాన్ని అడ్డుకోగలదు అని . భక్తి కార్యక్రమంలో భద్రతే మొదటి ప్రాధాన్యత" అని డీఎస్పీ అన్నారు. నిమజ్జన ఊరేగింపులో అత్యుత్సాహానికి పోకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.టూ టౌన్ ఎస్సై సైదాబాబు మాట్లాడుతూ.. మండపాల వద్ద భద్రత విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సీఐ ఆదిరెడ్డి, ఎస్సై మానస కార్పొరేటర్లు అల్లి సుభాష్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి అల్లి మల్లికార్జున్ యాదవ్,పోలీస్ సిబ్బంది,మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ఆర్డీఆర్ ఆశయ సాధనకు కృషి
# గురుభక్తిని చాటుకున్న కక్కిరేణి శ్రీనివాస్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

తన రాజకీయ గురువు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలోటీ షర్ట్ లపై జోహార్ దామన్న ముద్రించిన టీ షర్టులను ధరించి మాజీ మంత్రి ఆర్డీఆర్ పై అభిమానాన్ని చాటుకన్నారు.అనంతరం సూర్యాపేట లయన్స్ క్లబ్ సహకారంతో అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుచు తన తండ్రి దామన్న ఈ ప్రాంతానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ,దామన్న ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి సంకరమద్ది శ్రావ్య రెడ్డి,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, తోట శ్యామ్ ప్రసాద్,కరుణాకర్ రెడ్డి,కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమాసతీష్,త్రివేణి హరి, నాయకులు ఇస్రర్ అహ్మద్,పగిళ్ల మల్లారెడ్డి,షాదం దామోదర్ రెడ్డి మన్సూర్ భాయ్,బద్దం రాజిరెడ్డి,బద్దం మధుకర్ రెడ్డి,కక్కిరేణి అంజయ్య కక్కిరేణి ప్రసాద్,నీడ్స్ సాజీద్, గడ్డం వెంకన్న, నాగేల్లి అరుణ్, రాచకొండ శ్రీనివాస్,కొండ సంతోష్, కొండపల్లి లక్ష్మారెడ్డి, యాద కిరణ్, మిర్యాల



సుధాకర్, మిర్యాల వెంకటేశ్వర్లు, సత్యం,రమేష్,కృష్ణ రెడ్డి,నాగునాయక్,రమణ,సతీష్, హరిప్రసాద్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భరతనాట్య నృత్య ప్రదర్శన



**నలగొండ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్: శ్రీ శ్రీ శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్ పట్టణంలోని 13వ వార్డు ఆఫీసర్స్ కాలనీసంతోష్‌నగర్ గణేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో మంగళవారం భరతనాట్య నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నల్లగొండకు చెందిన అక్షర డాన్స్ అకాడమీ బృందం కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం



ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కళాకారులు సంప్రదాయ నృత్యరీతిలో వివిధ అంశాలను ప్రదర్శించి భక్తులను, స్థానికులను అలరించారు. కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద



సంఖ్యలో హాజరై నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.ఫోరండ్ల శివ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# వృద్ధురాలు అదృశ్యం..

ఇంటి నుంచి వెళ్లి.. తిరిగిరాని వృద్ధురాలు..

తాళ్లబావిగూడెంలో 75 ఏళ్ల అంజమ్మ అదృశ్యం..

ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన..

సమాచారం తెలిసిన వారు ఫోన్ చేయాలని విజ్ఞప్తి..

రూరల్ ఎస్సై శివప్రసాద్.

**నల్గొండ సెప్టెంబర్15,(ప్రజా జ్యోతి):**

నల్గొండ మండలం తాళ్లబావిగూడెం గ్రామానికి చెందిన వీరమల్ల అంజమ్మ (75) అదృశ్యమైనట్లు రూరల్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 14న ఉదయం 8 గంటల సమయంలో అంజమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లిందని, అనంతరం తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. అంజమ్మకు మతిస్థిమితం సరిగా లేదని, దీంతో ఆమె ఎక్కడైనా తప్పిపోయి ఉండవచ్చని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు.అంజమ్మ ఆచూకీ తెలిసిన వారు 8712670177, 8712667677 నంబర్లకు సమాచారం అందించాలని రూరల్ ఎస్సై శివప్రసాద్ కోరారు.



# టీఆర్ఎస్ హయాంలోనే.. తండాలు గ్రామ పంచాయతీలు..

**నూతనకల్..సెప్టెంబర్15 (ప్రజాజ్యోతి):**

గిరిజనులకు రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతం పెంచి గిరిజన తండాలను ఆవాసాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసిఆర్ దే అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ... తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 17న తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గిరిజన తండాలో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిల్ గౌడ్, గుగులోతు నర్సింగ్ నాయక్, చూడి లింగారెడ్డి, సర్పంచులు మహేశ్వరం మల్లికార్జున్, గాడుదుల లింగరాజు యాదవ్, గుగులోత్ కోటేషన్ నాయక్, జటంగి కృష్ణ, వస్రాశీ నాయక్, హనుమంతు నాయక్, హుస్సేన్ నాయక్, మూరగుండ్ల సైదులు, విద్యాసాగర్, విజయ్ కుమార్, మహేష్, నాగు నాయక్, ఉప్పుల వీరు యాదవ్, రవీందర్ రెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు..



# ఆర్డీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతాం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి):**

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్ఎస్.సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరంచీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్డీఆర్ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఆర్డీఆర్ చూపిన ప్రజాసేవా మార్గంలో పయనిస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అధికారుల జవాబుదారీతనం ఏదీ?

## - సర్పంచుల ఆగ్రహం.. సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ

**గరిడేపల్లి,సెప్టెంబరు 15(ప్రజా జ్యోతి):**

మండల అధికారుల తీరుపై సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడివేడి గా సాగింది.పలు శాఖలకు చెంది న అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై సర్పంచు లు మండిపడ్డారు.గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామాలకు రావడం లేదని,ఏ శాఖకు ఎవరు అధికారి అన్నది కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.పొనుగోడు సర్పంచ్ కటకం వేణు,రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజిగౌడ్, కుతుబ్‌షాపురం సర్పంచ్ ఆకుల కృష్ణ తదితరులు అధికారుల పనితీరుపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిధులు,వాటి ఆడిటింగ్‌పై వివరాలు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో చిన్న సమస్య వచ్చినా పంచాయతీలపైనే భారం వేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఆపరేటర్ల పెత్తనం కొనసాగుతోందని సర్పంచులు ఆరోపించారు.గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులు పొందేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నా యని తెలిపారు.ఒక ఆపరేటర్‌పై కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ అతనిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పొను గోడు రేషన్ షాపును ఎల్బీనగర్ కు చెందిన డీలర్ నిర్వహిస్తుండ టంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ కటకం వేణు తెలిపారు.వెంటనే నూతన డీలర్‌ను నియమించాలని కోరారు.కుతుబ్‌షాపురంలోనూ కొత్త డీలర్‌ను నియమించాలని సర్పంచ్ ఆకుల కృష్ణ కోరారు. సాగర్ నీటిని పంట పొలాలకు విడుదల చేస్తున్నారా చెరువులు నింపేందుకా అనే విషయంపై స్పష్టత



ఇవ్వాలని సర్పంచులు కోరారు.ఇందిరమ్మ ఇళ్ల విషయం లో అధికారులు స్పందించడం లేదని ఆరోపించా రు.దీనిపై ఏఈ యోగి స్పందిస్తూ గరిడేపల్లి, పాలకవీడు మండలాలకు ఇన్‌చార్జిగా ఉన్నానని,ఫోన్ చేసిన వారికి స్పందిస్తూ సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తున్నా నని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లలో ఎల్-3 నుంచి ఎల్-1కు మార్పు, వీఓఏ నూతన భవనాల నిర్మాణం తదితర అంశాలను కూడా సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.విద్య, వైద్యం,ఉపాధి,వ్యవసాయం, నీటిపారుదల శాఖలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు.సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ స్రవంతి,ఎంఈవో ఛత్రునాయక్,ఎంపీవో ఇబ్రహీం, ఏపీఎం అజయ్,ఏపీవో సురేష్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్‌తో పాటు అధికారులు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించిన పట్టుదల.. ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు!

## - నకిరేకల్‌కు చెందిన అబూబకర్ సిద్ధిఖ్ ఘనత..

## నీట్ ఫలితాల్లో 552 మార్కులు

**నల్లగొండ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్: పేదరికం ముందు ఎన్నో కలలు ఆగిపోతాయి.. కానీ పట్టుదల ముందు పేదరికమే ఓడిపోతుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, చదువుపై ఉన్న అచంచలమైన నమ్మకంతో ముందుకు సాగిన నకిరేకల్‌కు చెందిన అబూబకర్ సిద్ధిఖ్ అరుదైన విజయాన్ని సాధించాడు.నకిరేకల్‌కు చెందిన మౌలానా అక్బర్ కుమారుడు అబూబకర్ సిద్ధిఖ్.. తండ్రి గతేడాది మృతి చెందడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, తన లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదు. తండ్రి లేని లోటును అధిగమిస్తూ, కుటుంబ పరిస్థితులు తన చదువుకు అడ్డంకిగా మారకుండా గట్టి పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించాడు.నీట్ పరీక్ష ఫలితాల్లో 552 మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు సాధించాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన అబూబకర్ సిద్ధిఖ్ సాధించిన ఈ విజయం నకిరేకల్ ప్రాంతంలో పలువురి ప్రశంసలు అందుకుంటోంది.చదువుకోవాలనే సంకల్పం ఉంటే ఆర్థిక పరిస్థితులు అడ్డంకులు కావని నిరూపించిన అబూబకర్ సిద్ధిఖ్ విజయగాథ.. ఎంతోమంది పేద విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. పట్టుదల,



కష్టపడి చదివే తత్వం ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అతని విజయం చాటిచెబుతోంది. అబూబకర్ సిద్ధిఖ్‌ను పలువురు అభినందిస్తూ, భవిష్యత్తులో వైద్యుడిగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.